క్లుప్తంగా

100 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఎల్.ఎన్.పేట: గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ ఆస్పత్రి వైద్యులతో వైద్య సేవలు అందించేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలని ధనుకువాడ సర్పంచ్ చిన్నాల దాలప్పలనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని ధనుకువాడ గ్రామంలో నిహారిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మెడికవర్ ఆస్పత్రి ద్వారా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశామని సంస్థ అధ్యక్షుడు మెండ నర్సింహమూర్తి తెలిపారు. ఈసీజీ, రక్త పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. డాక్టర్ దిలీప్, డాక్టర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

సరుబుజ్జిలి: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఎఫ్ఎల్ మోటివేటర్ సీహెచ్ వెంకటేష్ తెలిపారు. ఆర్బీఐ ఆదేశాల మేరకు యూనియన్ బ్యాంకు వారి సౌజన్యంతో ఎస్ఎస్టీ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం విజయరాంపురం గ్రామంలో కళాజాతర బృందం సభ్యులు సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక సర్పంచ్ బెండి అప్పలనాయుడు, వెలుగు సీసీ రాజ్యలక్ష్మి, సిబ్బంది రామారావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యవసర సరుకుల అందజేత



దుస్తులు, బియ్యం ప్యాకెట్, నిత్యవసర సరుకులు అందజేస్తున్న నారాయణమూర్తి

పాతపట్నం: మండల కేంద్రంలోని ఎస్సీ వీధికి చెందిన గ్రామ వలంటీర్ బెనియా సత్యనారాయణ ఇంటిలో ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలిన ప్రమాదంలో సర్వం కోల్పోయారు. గ్రామ వలంటీర్ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బొత్స నారాయణమూర్తి సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి బియ్యం ప్యాకెట్, నిత్యవసర సరుకులు, దుస్తులు అందజేశారు. చందు, తదితరులు పాల్గొన్నారు.

కుప్పిలి కవితలకు స్వర్ణ కంకణం



ఆమదాలవలస: గంట వ్యవధిలో ఐదు కవితలు రాసినందుకు ఆమదాలవలసకు చెందిన కవి కుప్పిలి వెంకటరాజారావుకు స్వర్ణ కంకణం బహుమతి లభించింది. అక్టోబర్ 15న కరీంనగర్ ఆర్యాణి సకల కళా వేదిక, గౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కవితల పోటీల్లో వెంకటరాజారావు పాల్గొన్నారు. సాహితీ సామ్రాట్ పురస్కారాన్ని సోమవారం పోస్టల్ ద్వారా అందుకుని స్వర్ణకంకణ విజేతగా నిలిచారు. వెంకటరాజారావుకు పలువురు రచయితలు అభినందలు తెలిపారు.

నేటినుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఎల్.ఎన్.పేట: ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మండల స్థాయిలో వివిధ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఠాగూర్ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు పెద్దకోట వెంకటరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని డొంకలబడవంజ గ్రామంలో నిర్వహిస్తున్న ప్రజాగ్రంథాలయం (బీడీసీ) వద్ద వ్యాస రచన, వక్తృత్వ, పాటలు, చిత్రలేఖనం తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో గెలిపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

పోలాకి: మండల కేంద్రంలోని శాఖాగ్రంథాలయంలో మంగళవారం నుంచి గ్రంథాలయవారోత్సవాలు నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ కింజరాపు మానస తెలిపారు. 20వ తేదీ వరకు జరిగే ఈ వారోత్సవాల్లో గ్రంథాయ ఉద్యమంలో పాల్గొన్న నేతలకు నివాళులర్పించటంతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

పాతపట్నం: ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు పాతపట్నం శాఖా గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి కాళ్ల రాజు సోమవారం తెలిపారు. 14న ప్రారంభ వేడుకలు, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ప్రముఖులను స్మరించుట, చిత్రలేఖన, వ్యాసరచన, వృకృత్వ, క్విజ్, క్రీడా పోటీలు తదితర కార్యక్రమాలు, 20వ తేదీన ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.



పాతపట్నం: షిర్డీసాయి మందిరంలో ఓం ఆకారంలో దీపాల అలంకరణ



నరసన్నపేట: బీసీ బాలికల వసతి గృహంలో దీపాలు వెలుగించిన విద్యార్థినులు



ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేట గ్రామంలో నరకాసుర వధ

సందడిగా దీపావళి



ఆమదాలవలస: దీపావళి వేడుకల్లో స్పీకర్ తమ్మినేని సీతారాం, కుటుంబ సభ్యులు

వాడవాడలా ఆదివారం జరిగిన దీపావళి సంబరాలు అంబరాన్నంటాయి. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ఏటా అశ్వయుజ అమావాస్య రోజు ఈ పండగ నిర్వహించడం ఆనవాయితీ. చిన్నాపెద్దా తేడా లేకుండా దీపాలు వెలిగించారు. క్రాకర్స్ కాల్చి సంతోషంగా గడిపారు.

– సాక్షి నెట్‌వర్క్



సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో దీపావళి వేడుకల్లో పాల్గొన్న యువత



నరసన్నపేట: ఎస్సీ బాలికల వసతి గృహంలో సందడి చేస్తున్న విద్యార్థినులు



కొత్తూరు: కొత్తూరులో క్రాకర్స్ కాల్చుతున్న కుటుంబ సభ్యులు



పాతపట్నం: అనాథ ఆశ్రమానికి దీపావళి సామగ్రిని అందజేస్తున్న ఎస్ఐ మహమ్మద్ యాసిన్

పాలపోలమ్మ ఆలయ అభివృద్ధికి కృషి



ఆమదాలవలస: ఆలయ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

● స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణ పరిసర ప్రాంతాల ఇలవేల్పుగా కొలిచే పోలపాలమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని ఏపీ శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. ఈ యజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. సోమవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, మున్సిపల్‌శాఖ అధికారులతో కలిసి ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఆలయానికి అన్ని దిశలలో భక్తుల రాకపోకలు సాగేలా చూడాలన్నారు. ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు ఉన్న రక్షణ గోడకు దేవతామూర్తుల చిత్రాలు ఉండేలా మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ సుగుణాకర్, ఏఈ అప్పలనాయుడు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పొందూరు: అక్కమాంబ పేరంటాలను దర్శించుకుంటున్న స్పీకర్ సీతారాం దంపతులు

అక్కమాంబ పేరంటాలను దర్శించుకున్న స్పీకర్..

పొందూరు: స్థానిక అక్కమాంబ పేరంటాల పండగ సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రతిఏటా దీపావళి తరువాత మొదటి సోమవారం అక్కమాంబ పేరంటాలకు ముర్రాటలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా స్పీకర్ తమ్మినేని సీతారాం, వాణమ్మ దంపతులు సోమవారం రాత్రి అక్కమాంబ తల్లిని దర్శించుకున్నారు. పసుపు, కుంకుమను సమర్పించారు. జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, పార్టీ నాయకులు బండారు జైప్రతాప్‌కుమార్, అనకాపల్లి గోవింద, సత్తిబాబు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

● తల్లిదండ్రులకు పాదపూజ



భగవాన్ సత్యసాయి బాబా జన్మదినం పురస్కరించుకుని కొత్తూరు సత్యసాయి సమితి ఆధ్వర్యంలో 101 మంది తల్లిదండ్రులకు చిన్నారులు సోమవారం పాదపూజ చేశారు. బాలవికాస్ విభాగానికి చెందిన చిన్నారులతో ఈ కార్యక్రమం నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు వై.లింగరాజు, బాల వికాస్ కోఆర్డినేటర్ కోరాడ వెంకటరమణ, జోనల్ కన్వీనర్ పప్పు అప్పలనాయుడు, స్థానిక స్వతసాయి సమితి కన్వీనర్ లోతుగెడ్డ భగవాన్ నాయుడు, సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

– కొత్తూరు

బస్సు యాత్ర విజయవంతం చేయాలి

● డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు



సారవకోట: వైఎస్సార్‌సీపీ నాయకులతో చర్చిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య



పోలాకి: మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు

పోలాకి: నరసన్నపేటలో ఈ నెల 15వ తేదీన బీసీ మంత్రుల ఆధ్వర్యంలో జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో బస్సు యాత్ర ఏర్పాట్లపై అధికారులు, నాయకులతో పోలాకిలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని వెనకబడిన వర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటుచేసి రాజకీయంగా గుర్తింపు తెచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందన్నారు. మళ్లీ జగనన్నను సీఎం చేయాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా, సీనియర్ ఎమ్మెల్యేగా ఉన్న ధర్మాన కృష్ణదాస్ నియోజకవర్గంలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, పార్టీ నాయకులు రెంటికోట త్రినాథరావు, చింతు రాఘవరావు, మజ్జి లక్ష్మీనారాయణ, తూలుగు అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పాల్గొనాలి..

సారవకోట: ఈ నెల 15న నరసన్నపేట నియోజవర్గ కేంద్రంలో నిర్వహించనున్న సామాజిక బస్సు యాత్రను జయప్రదం చేయాలని పోలాకి మండల జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో సోమవారం సమావేశమయ్యారు. సామాజిక బస్సు యాత్రకు ప్రతీ ఒక్క కార్యకర్త హాజరు కావాలని కోరారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, జేసీఎస్ కన్వీనర్ నక్క తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

● నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: టీడీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని నియోజకవర్గంలోని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం నియోజకవర్గ స్థాయి వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో సోషల్ మీడియాను ప్రచార అస్త్రంగా వినియోగించుకోవాలని సూచించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు వివరించాలన్నారు. పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో సోషల్ మీడియా ప్రాధాన్యతను వివరించారు. జగనన్నను మళ్లీ సీఎంను చేయడానికి, నరసన్నపేటలో ఎమ్మెల్యేగా ధర్మాన కృష్ణదాస్‌ను గెలిపించడానికి సోషల్ మీడియా మరింత పటిష్టంగా పనిచేయాలన్నారు. ఈ నెల 15న నరసన్నపేటలో నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలోఏపీ శాసన మండలి ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ పి.వి.వి.సత్యనారాయణ రాజు (పెనుమత్స్య సురేష్ బాబు), నవరత్నాల ఎగ్జికూటివ్ వైస్ చైర్మన్ అంకం రెడ్డి నారాయణమూర్తి, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీ ఆరంగి మురళి, జేసీఎస్ కన్వీనర్లు సురంగా నర్సింగరావు, నక్క తులసీదాస్, కణితి సత్తిబాబు, పార్టీ నాయకులు చింతు రామారావు, రాజాపు అప్పన్న, కేసీహెచ్‌బీ గుప్త, కణుసు సీతారాం పాల్గొన్నారు.

15న హుండీ కానుకల లెక్కింపు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాతపట్నం నీలమణి దుర్గ ఆలయంలో హుండీ కానుకలను ఈ నెల 15వ తేదీన లెక్కించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ టి.వాసుదేవరావు సోమవారం తెలిపారు.

ఈ లెక్కింపు ఉదయం పది గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. గ్రామ పెద్దలు, భక్తులు హాజరు కావాలని కోరారు.

మిల్లర్లకు అదనంగా ధాన్యం ఇవ్వొద్దు

కొత్తూరు: తేమ పేరుతో మిల్లర్లకు అదనంగా ధాన్యం ఇవ్వొద్దని కొత్తూరు మండలం పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ తెలిపారు. కొత్తూరులో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో దళారీలను రైతులు నమ్మవద్దన్నారు. మండలంలోని 27 ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. మొదటి రకం క్వింటా ధాన్యానికి రూ.2203 ఉండగా.. 80 కిలాల బస్తా రూ.1762, రెండో రకం క్వింటా ధాన్యం రూ.2183 ఉండగా.. 80 కిలోల బస్తాకు రూ.1746 చెల్లిస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజులకు రైతులు ఖాతాల్లోకి నేరుగా ప్రభుత్వమే నగదు జమ చేస్తుందన్నారు. 80 కిలోల సంచికి రూ.20లు, రవాణాకు రూ.30లు ప్రభుత్వం అదనంగా ఇస్తుందన్నారు.

ఈఓపీఆర్డీ మృతికి పలువురి సంతాపం



వెంకటేశ్వరరావు (ఫైల్)

హిరమండలం: హిరమండలం ఈఓపీఆర్డీ సంపతిరావు వెంకటేశ్వరరావు గుండెపోటుతో ఇటీవల మృతి చెందారు. వెంకటేశ్వరరావు శ్రీకాకుళంలో నివాసం ఉంటున్నారు. గుండెపోటుతో తన స్వగృహం వద్ద మృతి చెందారు. ఈయన మృతిపట్ల ఎంపీడీఓ బొడ్డేపల్లి శైలజ, తహసీల్దార్ బెహరా మురళీమోహన్ రావు, పలువురు పంచాయతీ కార్యదర్శులు సోమవారం సంతాపం తెలియజేశారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఆమదాలవలస పట్టణానికి చెందిన కూచిపూడి నృత్య కళాకారిణి కూన శ్రీలత నృత్య ప్రదర్శించింది. ప్రముఖ నాట్యాచార్యులు డాక్టర్ యేలేశ్వరపు శ్రీనివాసులు సారథ్యంలో అద్భుత నృత్య ప్రదర్శనతో ఆకట్టుకుంది. శ్రీలతను ఆమదాలవలసకు చెందిన పలువురు సోమవారం అభినందించారు.

– ఆమదాలవలస

ముస్తాబైన శివాలయాలు

● నేటినుంచి కార్తీక మాసం ప్రారంభం

సారవకోట: మండలంలోని పలు శివాలయాలు కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు సిద్ధమయ్యాయి. సోమవారం అమావాస్య కావడంతో మంగళవారం నుంచి కార్తీక మాసం ప్రారంభం కానుంది. మండలంలోని పలు శివాలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. సారవకోటలో మూడు శివాలయాలు, అంగూరు, అలుదు, నౌతళ, బద్రి, చీడిపూడి, బుడితి, అవలింగి గ్రామాల్లోని శివాలయాలను విద్యుత్ దీపాలు, పూలమాలతో అలంకరించారు.

ఆలయాల్లో ఆకాశ దీపాలు..

పాతపట్నం: శివాలయాల్లో కార్తీక మాసం ప్రారంభం నుంచి ముగింపు వరకు ప్రతీరోజు సూర్యాస్తమయంలో ఆకాశ దీపాన్ని వెలిగించి శివునికి పూజలు నిర్వహిస్తారు. ఈ మాసంలో ప్రతీ సోమవారం శివునికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు చేసి భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. కార్తీక మాస పూజలకు ఆలయాలు ముస్తాబు చేశారు. పాతపట్నంలోని నీలకంఠేశ్వర ఆలయంలో సోమవారం సాయంత్రం సూర్యాస్తమయ సమయంలో మహిళలు ఆకాశ దీపాన్ని వెలిగించారు.



సారవకోట: ప్రత్యేక అలంకరణలో అవలింగి మల్లికార్జున స్వామి ఆలయం



పాతపట్నం: నీలకంఠేశ్వర ఆలయంలో ఆకాశ దీపాలు వెలిగించిన మహిళలు